# అరువుల వ్యసనం

"ఆంటీ! కాస్త పంచదార ఇవ్వమంది అమ్మ" అంటూ వచ్చింది వినీల.

"కాస్తంటే ఎంతమ్మా?" కోపాన్నణుచుకుంటూ నవ్వుతూ అడిగాను.

"ఓ చిన్న గ్లాసుడు సరిపోతుంది" అంటూ నవ్వింది.

ఇల్లంతా పరిశీలనగా చూస్తూ "మీరు టి.వి చూడరా ఆంటీ!" అంటూ ప్రశ్నించింది. "ఈ టైంలో మా ఇంట్లో టి.వి మ్రోగుతూ ఉండాల్సిందే" అని మళ్ళీ తనే అంది పంచదార తెచ్చి, ఆ అమ్మాయికి ఇస్తూ, "మా పిల్లలు చదువుకునే సమయం కదా! అందుకని ఈ టైంలో మా ఇంట్లో టి.వి పెట్టము" అని బదులిచ్చాను. పంచదార తీసుకుని వెళ్ళిపోయిన వినీల పావుగంటకి మళ్ళీ వచ్చింది. ఈసారి చిన్న అల్లంముక్క కావాలంది. విసుగు కన్పించకుండా ముఖాన్ని ప్రక్కకి తిప్పుకుంటూ తెచ్చిచ్చాను.

మేము ఇంట్లో దిగి వారం రోజులయినా కాలేదు. ఇంటి ఓనర్ వాళ్ళమ్మాయి వినీల, ఇంట్లోకి వచ్చినప్పటి నుండి ఇదే తంతు. 'ఎన్నని ఇవ్వగలము, అడిగే వాళ్ళకి కొంచెమైనా ఉండాలి' అనుకుంటూ పిల్లలకి హోమ్‌వర్క్ చేసుకోమని చెప్పి వంటింట్లోకి నడిచాను. నాకు ఉన్నదాంట్లో సర్దుకోవటం ఇష్టం. ఎంతో అవసరమైతే తప్ప ప్రక్కవాళ్ళని అడిగే అలవాటు మంచిదికాదని నాకనిపిస్తుంది.

మావారు వచ్చేసరికి వంట రెడీచేసి, పిల్లలకి భోజనాలు పెట్టి వీక్లీ చూస్తూ కూర్చున్నాను. మావారు వచ్చిన తరువాత ఇద్దరం భోజనానికి కూర్చున్నాం. అప్పుడు మళ్ళీ వచ్చింది వినీల. నాకెందుకో అసహనంగా అన్పించింది.

"ఏం కావాలి?" అన్నాను గట్టిగా. "ఆంటీ! పెన్నూ..." అంటూ నసిగింది. పెన్ను ఇస్తే తీసుకుని వెళ్ళిపోయింది.

"ఇదీ వరస" అన్నాను ఆయనతో. "ఇరుగు-పొరుగు అన్నాక ఈమాత్రం కో-ఆపరేషన్ ఉండాలి కదా" అన్నారు ఆయన. "అలాగని దానికో లిమిట్ ఉంటుంది కదా!" అన్నాను.

దానికి ఆయన "రేపు మనకీ అవసరం పడొచ్చు కదా" అన్నారు.

ఇంక వాదించడం ఇష్టంలేక మానుకున్నాను. "పెరుగు ఇద్దరికీ సరిపోయేలా లేదు. ముందుగా చెప్పి ఉంటే బయటనించి తెచ్చేవాణ్ణిగా" అంటూ నావంక చూసారాయన. ఇంతలో మా పుత్రరత్నం వినయ్ "అమ్మా! వినీల వాళ్ళింట్లో అడిగి తేనా?" అన్నాడు. పదే పదే వినీల అరువు గోల చూసి వినయ్‌కి ఈ ఆలోచన వచ్చిందని నాకు అర్థం అయింది. అత్యవసరానికి సహాయం తీసుకోవడం వేరు. అది అలవాటుగా మారటం వేరు.



"వద్దు వినయ్! ప్రతిదానికి ప్రక్కవాళ్ళని అడగకూడదు. మజ్జిగ చేసుకుంటే సరిపోతుంది ఈ పూటకి" అని చెప్పాను.




☆☆☆

మొహమాటం అనాలో, సంస్కారం అనాలో తెలీదు కానీ నేను ఇవ్వటం, వాళ్ళు తిరిగి ఇవ్వకపోవటం నాకు బాధగా ఉంది. ఈ ధరలు పెరిగిన కాలంలో ఇలా సరుకుల్ని బదులివ్వటం అంటే కుదిరే పని కాదు. ఈ సమస్యకి పరిష్కారం ఆలోచిస్తున్నాను.

ఓరోజు నాకు పచ్చిమిరపకాయలు అవసరం అయ్యాయి. వినయ్‌ని వినీల వాళ్ళింటికి పంపాను. "లేవట" అంటూ వచ్చాడు. నేను ఎన్నిసార్లో ఇచ్చాను. కానీ ఒక్కసారికే లేవని పంపారు. నేనే వెళ్ళి "నాలుగు పచ్చిమిరపకాయలివ్వండి వదినగారు" అన్నాను.

"నాలుగంటే నాలుగే ఉండగా ఇదుగో ఇప్పుడే గారెల పిండిలో వేసాను" అంది ఆమె మిక్సీలోంచి పిండిని తీస్తూ. "అరె నేను ఇవే చేయాలనుకుంటున్నాను. మరి మీరేమీ అనుకోకుండా సగం పిండి ఇవ్వండి. మా ఇంటికి గెస్ట్ వచ్చారు. కాస్త తొందరగా ఇచ్చారంటే టిఫిన్ చేసి పెట్టాలి" అన్నాను.

తప్పనిసరై ఇచ్చింది వినీల తల్లి. పాపం గారెలపిండితో నోరూరిస్తూ గారెలు తినే ఊహల్లో ఉన్న ఆమె సగం పిండితో అందరికీ సరిపెట్టలేదని నాకు తెలుసు. ఆమెకు చాలా కోపంగా, బాధగా, విసుగ్గా అన్పించే ఉంటుంది. నేను దబాయించి బలవంతంగా పిండి లాగేసుకున్నంత పని చేసాను కదా! దెబ్బతిన్నట్టుగా చూసింది. తర్వాత ఏమనుకుందోగాని మరెప్పుడూ వినీల మా ఇంటికి అరువు కోసం రాలేదు, మా పిల్లలతో ఆటలకి తప్ప!

-టి.శ్రీవాణి